డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు సీఎం నివాళి



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



తన మనవడి వివాహానికి హాజరుకావాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమూద్‌అలీ దంపతులు. చిత్రంలో ఎమ్మెల్యే కేటీఆర్ తదితరులు

మైటోకాండ్రియా పనితీరుపై ప్రొటీన్స్ ప్రభావం

సీసీఎంబీ పరిశోధనల్లో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకే తరహా ప్రొటీన్ కణజాలం ఒకేలా పనిచేసినప్పటికీ, మైటోకాండ్రియాలోని ప్రొటీన్ పనితీరును అందులో ఉన్న లిపిడ్స్ ప్రభావం చూపుతాయని సీసీఎంబీ పరిశోధనల్లో వెల్లడయింది. సెంటర్ ఫర్ మాలిక్యులర్ బయాలజీలో డాక్టర్ స్వాతి రాయ్‌చౌదరి పరిశోధనలో వెలుగులోకి వచ్చిన అంశాలు నేచర్ కమ్యూనికేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మొక్కలు, జంతువుల్లో శ్వాస క్రియలో మైటోకాండ్రియా కణాల లోపల ఉన్న పొరల్లో రసాయన ప్రక్రియ జరుగుతుంది. ఇది జీవుల మనుగడకు కీలకం. మైటోకాండ్రియా లోపలి పొరల్లో కీలకమైన కార్డియోలిపిన్ పరిశీలించిగా నిర్మాణాల్లో తేడాలను గుర్తించారు. ఈ విభిన్న కార్డియో లిపిన్‌లు వివిధ రకాల కణాలు వేర్వేరు పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు సహకరిస్తాయని డాక్టర్ స్వాతి రాయ్‌చౌదరి బృందం పరిశోధనల్లో తేలింది.



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

మాదిగ అమరుల త్యాగాల మీద మందకృష్ణ భోగాలు

- టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ


బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరుల త్యాగాల పునాదుల మీదనే మందకృష్ణ మాదిగ భోగాలు అనుభవిస్తున్నారని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. 30ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో అమరుల కుటుంబాలను మందకృష్ణ ఏనాడూ పరామర్శించలేదని విమర్శించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో.. వర్గీకరణ ఉద్యమ అమరుల కుటుంబసభ్యులు మునుగు అంజయ్య, ఇందిరమ్మ, నడిమోది కావేరి, పొన్నాల యాదయ్యలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రకుల నేతల ఇళ్లలో పెళ్శిళ్లు, చావులకు వెళ్లే సమయం ఉన్న మందకృష్ణకు అమరుల కుటుంబాలను పరామర్శించే సమయం లేదా అని ప్రశ్నించారు. ఆయన బీజేపీతో కుమ్మక్కై ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధంగా అమలు కాకుండా కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మార్చి 1న అన్ని జిల్లా కేంద్రాల్లో అమరుల సంస్మరణ కార్యక్రమం, మార్చి 19న హైదరాబాద్‌లో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరుల కుటుంబాల్లో ఇంటికి ఒక ఉద్యోగం, రూ.50 లక్షల ఆర్థిక సహాయం చేయాలని వంగపల్లి డిమాండ్ చేశారు.

ఆధునిక సాంకేతిక వినియోగంలో తెలంగాణ జైళ్ల శాఖ రోల్ మోడల్



జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్‌కు ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్లను పంపిణీ చేస్తున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా

సైదాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక వినియోగంలో తెలంగాణ జైళ్లశాఖ రోల్ మోడల్‌గా నిలిచిందని రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు చైర్మన్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ వీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ఇంటర్ అపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్)లో భాగంగా శుక్రవారం చంచల్‌గూడలోని సీకా హాల్‌లో రాష్ట్రంలోని అన్ని జైళ్లకు రూ.2కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన హై టెక్నాలజీ ఎలక్ట్రానిక్ పరికరాలను జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రాతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఐసీజేఎస్ వ్యవస్థలో క్రిమినల్ జస్టిస్‌లో ప్రధాన స్తంభాలైన పోలీస్, కోర్టులు, జైళ్లు, ప్రాసిక్యూషన్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ల డేటాబేస్‌లను డిజిటల్‌గా లింక్ చేయడం ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేయవచ్చని అన్నారు. డిజిటలైజేషన్‌లో పోలీస్, జైళ్లశాఖ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయని కొనియాడారు. జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ జైళ్లలో నూతన టెక్నాలజీ వినియోగంపై ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా జైళ్ల డీజీ, ఐజీల సదస్సులో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ప్రశంసించారని తెలిపారు. కార్యక్రమంలో ఐజీ వై.రాజేష్, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు నవాబ్ శివకుమార్ గౌడ్, రామచందర్, కళాసాగర్, సంతోష్‌రాయ్, లక్ష్మీశ్రీనాథ్, వెంకటేశం, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర, జిల్లా, సబ్ జైలు అధికారులకు హైటెక్నాలజీ ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేశారు.



ఎల్జీబీటీక్యూ హిస్టరీ మంత్ సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని లామాకాన్‌లో లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్, క్వీర్ వ్యక్తుల హక్కుల మీద చర్చాగోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ నటుడు ఎల్‌బీ శ్రీరాం, సీనియర్ జర్నలిస్టు ప్రేమమాలినితో పాటు పలువురు హక్కుల కార్యకర్తలు, రచయితలు పాల్గొని వివిధ అంశాలపై సంభాషించారు.

డంపింగ్ యార్డుగా ఎన్టీఆర్ స్టేడియం

ఎన్టీఆర్ స్టేడియంలో చెత్తాచెదారం



స్టేడియంలో పార్క్ చేసిన వాహనాలు

చెత్త తొలగించకపోతే ధర్నా చేస్తాం



ఎన్టీఆర్ స్టేడియంలో చెత్తా చెదారం తొలగించకపోతే జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం. స్టేడియం నిర్వహణను జీహెచ్ఎంసీ అధికారులు విస్మరిస్తున్నారు. చెత్త డంపింగ్ చేస్తున్న, వాహనాలను పార్కింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- సి. సాయిబాబా, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు

దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం



ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ఇంటి తలుపులు, కిటికీలు మూసుకోవాల్సి వస్తోంది. చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

- పి.ఎన్.చారి, న్యూఅంబేడ్కర్‌నగర్

- పేరుకుపోయిన చెత్తాచెదారంతో దుర్వాసన
- వాహనాల పార్కింగ్
- క్రీడాకారులు, ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ స్టేడియం నేడు డంపింగ్ యార్డుగా మారింది. దుర్వాసనతో క్రీడాకారులు, చుట్టుపక్కల నివసిస్తున్న వారు, వాకింగ్ కోసం స్టేడియానికి వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. స్టేడియానికి గేట్లు, సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో రాత్రి వేళల్లో చెత్త, వ్యర్థాలను లారీలలో తీసుకొచ్చి స్టేడియంలో డంప్ చేస్తున్నారు. వాహనాలను స్టేడియంలోనే పార్కింగ్ చేస్తున్నారు. స్టేడియంలో చెత్తా చెదారం డంపింగ్, వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులకు స్థానికులు, క్రీడాకారులు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్టీఆర్ స్టేడియం నిర్వహణను జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదని వాకర్స్ వాపోతున్నారు. స్టేడియంలో చెత్తా చెదారం, మట్టిని తొలగించాలని, వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్లు శుక్రవారం పరిశీలించారు. ముషీరాబాద్ డివిజన్ బాప్టిస్ట్ చర్చి వీధిలో కచ్చానాలా నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నాలాలో పూడిక తీసి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

అజీజియా మసీదు వీధిలో..

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అజీజియా మసీదు వీధిలో నిర్మిస్తున్న రోడ్డు పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో..

చిక్కడపల్లిలోని ఈశ్వర్‌రెడ్డి, సోప్ ఫ్యాక్టరీ వీధులు, ఉమాగార్డెన్ ప్రాంతాలలో డ్రైనేజీ పైపులైన్ పనులను మాజీ కార్పొరేటర్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు.



అజీజియా మసీదు వీధిలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి



ఎంటమాలజీ విభాగం అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

- జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే కాలేరు ఆదేశం

గోల్నాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దోమలు, పరిశుభ్రత సమస్యలపై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు కాలనీలు, బస్తీల్లో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంటమాలజీ ఎస్ఈ దుర్గాప్రసాద్, ఏఈ అంబిక, ఈఎఫ్ఎస్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం దైవకార్యంతో సమానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, చేపూరి లక్ష్మణ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్నదానం దైవ కార్యంతో సమానమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం గేట్ వద్ద ప్రొద్దుటూరు నరసింహారావు, చేపూరి లక్ష్మణ్, చేపూరి బాలకృష్ణ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి పల్లెర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

అన్నిదానాలకంటే అన్నదానం మిన్న అని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆర్యవైశ్య సంఘం గాంధీనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్ ఈశ్వరలక్ష్మి ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తాము సంపాదించినదాంట్లో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే జీవితం సార్థకం అవుతుందన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లంపేట రమేష్‌రామ్, జిల్లా గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్/రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తా వద్ద వాసవీ సేవా సమితి రాంనగర్, కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా రాజ్యలక్ష్మి దంపతులు, యాదగిరి గుప్తా అంజమ్మ దంపతుల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని భరత్‌గౌడ్, గ్లోబుల్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ చింతల శ్రీనివాస్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ప్రారంభించారు. వాసవీసేవా సమితి చైర్మన్ రాజశేఖర్ గుప్తా, అధ్యక్ష కార్యదర్శులు రాజు, శివకుమార్, కోశాధికారి శ్రీనివాస్, బీజేవైఎం నగర నాయకుడు అజయ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సంధ్యారాణి

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గోల్నాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే సరైన న్యాయం జరుగుతుందని హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ సంధ్యారాణి, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో ఎస్సీ, ఎస్టీ పౌరహక్కుల దినోత్సవ సభను నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. కాచిగూడ ఎస్ఐ కె.నరేష్, ఏఎస్‌డబ్ల్యూ మోహన్‌నాయక్, బస్తీ ప్రధానకార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ నాగమారుతీశర్మ

తొలితరం తెలుగు సాహిత్య నిధి 'నోరి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సంస్కృత, ఆంగ్ల, తెలుగు సాహిత్యాలపై అపార సాధికారత ఉన్న తొలితరం తెలుగు సాహిత్య నిధి నోరి నరసింహశాస్త్రి అని సీబీఐ న్యాయస్థానం పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం నరసింహశాస్త్రి యాదిలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కవి పెద్దూరి వెంకటదాసు, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

రేపు పలువురు మహిళలకు అవార్డుల ప్రదానం

నల్లకుంట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా శక్తి మహాకుంభ్, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 2న సికింద్రాబాద్‌లోని గుజరాతీ పాఠశాలలో పలువురు మహిళలకు అవార్డులు ప్రదానం చేస్తామని సంస్థ చైర్మన్ జస్వత్ పటేల్ తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు.

'ఖాళీ స్థలాల చార్జీలను లేఅవుట్ యజమానుల నుంచే వసూలు చేయండి'

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థలాల(ఓపెన్ స్పేస్) చార్జీలను లేఅవుట్ యజమానుల నుంచే వసూలు చేయాలని సీపీఎం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లేఅవుట్ క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం 14 శాతం ఖాళీ స్థలాల చార్జీల భారం ప్లాట్ కొనుగోలు చేసిన సామాన్యులపై పడుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో సీపీఎం నగర కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు.

వర్గీకరణను రెండుగ్రూపులుగా ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసి అమలు చేస్తే ఎస్సీల్లోని అన్ని కులాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నేతలు జి చెన్నయ్య, బేర బాలకిషన్, చెరుకు రాంచందర్ తదితరులు అన్నారు. శుక్రవారం బీఆర్‌కే భవన్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా 18 శాతం పెరిగిందని, ఇది పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల, మాదిగల ఉపకులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వెయ్యికోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. జేఏసీ నేతలు బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, మన్నె శ్రీధర్, ఆవుల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జానపద కళాకారుల డిమాండ్ల సాధనకు

త్వరలో రవీంద్రభారతి ముట్టడి

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జానపద వృత్తి కళాకారుల డిమాండ్ల సాధనకు త్వరలో రవీంద్రభారతి ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని తెలంగాణ జానపద కళాకారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జానపద కళాకారులకు 10 లక్షల కళాబంధు, పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



జ్యోతిగోడ్

కవాడిగూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు.న్యూబోయిగూడలో నివసిస్తున్న ఒడిశా ప్రాంతానికి చెందిన కురభిగోడ్, చమన్‌గోడ్ కుమార్తె జ్యోతిగోడ్(19) శివరాత్రి రోజున పండ్లు కొనడానికి సుమతీదేవితో కలిసి బోయిగూడ రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. జ్యోతి ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాంధీ ఆస్పత్రికి వెళ్లి..



భాగ్యమ్మ

గాంధీ ఆస్పత్రికి వెళ్లిన వృద్ధురాలు కనిపించకుండాపోయింది. దోమలగూడ మైసమ్మబండలో నివసిస్తున్న శోభ కుమారుడు ఫిబ్రవరి 23న అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో చేరాడు. అతడిని 26వ తేదీన డిశ్చార్జి చేస్తున్నారని బంధువులతో కలిసి శోభ తల్లి భాగ్యమ్మ(61) వెళ్లింది. ఆస్పత్రి నుంచి ఇంటికి వస్తుండగా ఆమె అదృశ్యమైంది. భాగ్యమ్మ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యం పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే వేడుకలు జరిగాయి. జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వెల్‌నెస్ ఫౌండేషన్ మెడికల్ క్యాంప్, అల్లోపతి ఆయుర్వేదిక్ యూనానీ, హోమియోపతి చికిత్స విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద ఔషధాలను పంపిణీ చేశారు. డాక్టర్లు ఎ.మల్లికార్జున్‌యాదవ్, జి.మనీష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బండ్ల శ్రీధర్‌కుమార స్వామి, లైఫ్‌సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వెంకటేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.